APGDC
ANDHRA PRADESH GAS DISTRIBUTION CORPORATION LTD

Eenadu, Hyderabad
Tuesday, October 13, 2015

# కేజీ డీ6లోకి ఓఎన్‌జీసీ గ్యాస్!

## డీఅండ్‌ఎం ముసాయిదా నివేదిక

దిల్లీ: ఓఎన్‌జీసీ జీ-4 (గోదావరి బ్లాక్) నిక్షేపం నుంచి రూ.9000 కోట్ల విలువ చేసే 900 కోట్ల ఘనపు మీటర్ల సహజవాయువు.. పక్కనే ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్)కు చెందిన కేజీ- డీ6 చమురు క్షేత్రంలోకి చేరి ఉండొచ్చని అమెరికా కన్సల్టెన్సీ సంస్థ డీఅండ్‌ఎం తెలిపింది. ఆర్ఐఎల్, ఓఎన్‌జీసీతో పాటు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్‌కు సమర్పించిన ముసాయిదా నివేదికలో పైవిషయాన్ని వెల్లడించిందని అధికారులు పేర్కొన్నారు. పక్కపక్క ఉన్న నిక్షేపాలు కలిసిపోయాయో లేదో అనే విషయాన్ని గుర్తించేందుకు ఓఎన్‌జీసీ, ఆర్ఐఎల్‌లు డీఅండ్‌ఎంను నియమించుకున్నాయి. డీఅండ్‌ఎం తుది నివేదికను సిద్ధం చేసే లోపు, ఈ నివేదికలో వెలుగుచేసిన అంశాలపై వివరణ ఇచ్చేందుకు ఈ రెండు కంపెనీలకు అవకాశం లభిస్తుంది. జీ-4 నిక్షేపంలో ఇప్పటివరకు ఓఎన్‌జీసీ గ్యాస్‌ను ఉత్పత్తి చేయకపోవడం వల్లే కొంత భాగం కేజీ డీ6 నిక్షేపంలోకి వెళ్లిఉండచ్చొని డీఅండ్‌ఎం అభిప్రాయ పడిందని అధికారులు తెలిపారు. 2009 ఏప్రిల్ నుంచి కేజీ- డీ6లో గ్యాస్ ఉత్పత్తిని ఆర్ఐఎల్ ప్రారంభించింది. 2015 మార్చి 31 వరకు మొత్తంగా 5867 కోట్ల ఘనపు మీటర్ల గ్యాస్‌ను ఆర్ఐల్ ఉత్పత్తి చేసిందని డీఅండ్‌ఎం నివేదికలో తెలిపింది. ఇందులో కనీసం 900 కోట్ల ఘనపు మీటర్ల గ్యాస్ ఓఎన్‌జీసీకి చెంది ఉండొచ్చని పేర్కొంది. డీఅండ్‌ఎం వచ్చే నెలలో తుది నివేదికను సమర్పించే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. ఓఎన్‌జీసీకి ఆర్ఐఎల్ ఏమైనా పరిహారం చెల్లించాల్సి ఉంటుందా అనే నిర్ణయాన్ని నివేదిక అందిన తర్వాత నుంచి ఆరు నెలల్లోగా చమురు మంత్రిత్వ శాఖ తీసుకోవాల్సి ఉంటుంది.